## మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు దోహదం



వార్త 2 లో.


# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 20 జూన్ , 2024 | పేజీలు : 04


## పురపాలక పాలనలో మార్పు కన్పించాలే..



రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/మంథని :** పురపాలక పాలకవర్గ పాలనలో ప్రజలకు స్పష్టమైన మార్పు కన్పించాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంథని ప్రజలు ఆశించిన మార్పును మనం చేసి చూపించాలని, ఇందుకోసం మూడు రెట్లు కష్టపడి పనిచేయాలన్నారు. మంథని మున్సిపాలిటీని అవినీతిరహితంగా పారదర్శకంగా పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజలు హర్షించే విధంగా కౌన్సిలర్‌లు పని చేయాలని, వీరికి అవసరమైన అన్ని రకాల తోడ్పాటు అందించాలని అధికారులకు సూచించారు.మున్సిపల్ పాలనలో దేశంలో అమలు అవుతున్న బెస్ట్ ప్రాక్టీస్‌లను ఇక్కడ అమలు చేయాలని, దీనికోసం స్టడీటూర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. మున్సిపాలిటీలో అవసరం మేరకు సిబ్బందిని అందుబాటులో ఉండేలా చూడాలని, కనీస అవసరాలు తీర్చే దిశగా కార్యాలయంలో వెంటనే హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు.విద్యుత్, నీటి సమస్యలు,నీటి సరఫరా, మురికి కాలువలు తదితర అంశాలపై ఫిర్యాదులు నమోదు చేసుకునేందుకు వీలుగా హెల్ఫ్‌లైన్ నంబర్ ఉండాలన్నారు.మంథనిలో డంపింగ్ యార్డుకు వెంటనే ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించి చెత్తను తరలించాలని ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఉండే స్థలం ఎంపిక చేయాలన్నారు. వర్షకాల సీజన్ ప్రారంభం అయిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులురాకుండా చూడాలని, ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. పట్టణ ఎంట్రెన్స్ ఆర్చరీ, నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణం, ఆసుపత్రి నిర్మాణం, రెవెన్యూ డివిజన్ కార్యాలయ నిర్మాణం, సమీకృత తహశీల్దార్ కార్యాలయ నిర్మాణాలకు అనువైన స్థలాల ఎంపిక కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమాసురేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఆర్డీఓ హనుమానాయక్, మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున స్వామితో పాటు ఆయా శాఖల అదికారులు,మున్సిపల్ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండులో జన్మించిన పాపకు జీవితకాలం ఉచిత బస్‌పాస్



ఆర్టీసి ఎండి సజ్జనార్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ బస్‌స్టేషన్‌లో పుట్టిన చిన్నారికి తమ బస్సుల్లో జీవితకాలం ఉచితంగా ప్రయాణించేలా బస్‌పాస్‌ను అందిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టిజిఎస్ ఆర్టిసి యాజమాన్యం వెల్లడించింది. ఆర్టీసి బస్సులు, బస్‌స్టేషన్లలో పుట్టిన పిల్లలకు జీవితకాలపు ఉచిత బస్‌పాస్‌ను ఇవ్వాలని గతంలో యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ ఆడపిల్లకు బర్త్‌డే గిఫ్ట్‌గా లైఫ్ టైం ఫ్రీ బస్‌పాస్‌ను మంజూరు చేస్తున్నట్లు వివరించింది. గత ఆదివారం కరీంనగర్ బస్‌స్టేషన్‌లో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి ఆర్టీసి సిబ్బంది పురుబు పోసి మానవత్వాన్ని చాటుకున్నారు. దీంతో కరీంనగర్ ఆర్టీసి బస్టాండులో మహిళలకు పురుడు పోసిన సిబ్బందిని ఆర్టీసి ఎండి సజ్జనార్ అభినందించారు. బుధవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో సంస్థ ఉన్నతాధికారులతో కలిసి వారిని ఘనంగా సత్కరించారు.

## కేంద్ర మంత్రి పదవి కార్యకర్తల భిక్షే..

### కార్పొరేటర్ నుంచి కేంద్ర మంత్రిగా ఎదగడం బిజెపిలోనే సాధ్యం

### రాష్ట్రానికి, కరీంనగర్ పార్లమెంటుకు అధిక నిధులు తీసుకువస్తా..



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తనకు కేంద్ర మంత్రి పదవి దక్కడం కరీంనగర్ ప్రజలతో పాటు కార్యకర్తలు పెట్టిన భిక్షేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కార్యకర్తలారా.. ఆనాడు నాతో కలిసి మీరు కెసిఆర్ మూర్ఖపు పాలనపై పోరాడితే లాఠీదెబ్బలు తిన్నరు.. కేసులు ఎదుర్కొన్నారు.. జైళ్లకు వెళ్లారు.. రక్తం చిందించారు.. ప్రజా సంగ్రామ యాత్రలో నాతో కలిసి అడుగులో అడుగు వేసుకుంటూ కష్టాలను లెక్క చేయకుండా 155 రోజుల పాటు 1600 కిలోమీటర్లకు పైగా నడిచారు. పార్టీ బలోపేతం కోసం ఎంతో కష్టపడ్డారు.. అందుకే ఈ రోజు నాకీ పదవి వచ్చింది.. ఈ పదవి మీరు పెట్టిన బిక్షే.. ప్రజలకు, కార్యకర్తలకే ఈ పదవిని అంకితమిస్తున్నా..అ ని పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా తొలిసారి కరీంనగర్‌కు వచ్చిన బండి సంజయ్‌కు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. ఈ సంధర్భంగా కరీంనగర్‌లో మీడియాతో సంజయ్ మాట్లాడారు. కార్పొరేటర్ నుంచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఎదిగానంటే ఇది కేవలం బిజెపి వల్లే సాధ్యమయ్యిందని, అమ్మ వారి ఆశీస్సులతోనే సాధ్యమయ్యిందని పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తెలంగాణలో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం బిజెపి కార్యకర్తలపై ప్రయోగించిన లాఠీదెబ్బలకు , బిఆర్ఎస్ మూర్ఖత్వ పాలనను నిరసించిన కార్యకర్తలను జైలుకు పంపడం ద్వారా, ప్రజా సమస్యలపై పోరాడుతున్న బిజెపి కార్యకర్తలపై రౌడీషీట్లు తెరిచినందుకు తనకు గుర్తింపు వచ్చిందన్నారు. ప్రజాసంగ్రామ యాత్ర పేరుతో 155 రోజులు పాదయాత్ర చేసి 1600 కిలోమీటర్ల తిరిగితే తనతో కార్యకర్తలు నడిచినందుకే ఈ పదవి వచ్చిందన్నారు. కేంద్ర మంత్రి పదవి అధికారం కోసమో ,పదవులు అనుభవించడానికో.. అక్రమంగా సంపాదించుకోవడానికో కాదు.. దేశ రక్షణ, ధర్మ రక్షణ, సమాజ సంఘటితం కోసం తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయడం కోసం ఉపయోగిస్తానన్నారు. రాజకీయాలకతీతంగా కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తానన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు.. ఎన్నికల తర్వాత పూర్తిగా తెలంగాణ అభివృద్ధి, కరీంనగర్ అభివృద్ధి కోసమే పనిచేస్తానన్నారు. సెల్యూట్ తెలంగాణ పేరుతో నిర్వహించే కార్యక్రమానికి తెలంగాణలోని ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయంతం చేయాలని కోరారు.



### కరీంనగర్ గడ్డకు ప్రణమిల్లి...

కేంద్ర మంత్రి హోదాలో తొలిసారి అడుగుపెట్టిన బండి సంజయ్‌కు కనీవినీ ఎరగని రీతిలో కరీంనగర్ ప్రజలు, బిజెపి కార్యకర్తలు, నాయకులు అపూర్వ స్వాగతం పలికితే కరీంనగర్ గడ్డకు ప్రణమిల్లి పాదాభివందనం చేసిన బండి సంజయ్ సెల్యూట్ కరీంనగర్.. సెల్యూట్ తెలంగాణ అంటూ తనకు జన్మనిచ్చిన గడ్డపట్ల ఉన్న ప్రేమను, కరీంనగర్ ప్రజలపై ఉన్న అభిమానాన్ని, తెలంగాణ, దేశం పట్ల ఉన్న మమకారాన్ని చాటి చెప్పారు. శనిగరం నుంచి జిల్లాకు చెందిన బిజెపి నాయకులు స్వాగతం పలికారు. కర్రసాముతో బిజెపి నేత ఎస్.కుమార్ తన అభిమానాన్ని చాటుకున్నారు. కరీంనగర్ కమాన్ వద్ద రహదారి పక్కనే ప్రణమిల్లారు. సాష్టాంగ నమస్కారంచేశారు. గీతాభవన్ చౌరస్తా వద్దకు రాగానే ముస్లిం నేతలు బండి సంజయ్‌ను పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్భంగా బిజెపి నాయకులు బుల్డోజర్లతో సంజయ్‌పై పూలు కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతర్ ఆర్అండ్‌బి గెస్ట్ హౌజ్ వద్దకు విచ్చేసిన బండి సంజయ్‌కు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ విచ్చేసి పూలమాల అందించి స్వాగతం పలికారు. ఈ సంధర్భంగా బండి సంజయ్‌కు పోలీసులు గౌరవ వందనం చేశారు. అక్కడి నుంచి నేరుగా చైతన్యపురిలో మహాశక్తి అమ్మవారి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నీతి ఆయోగ్‌లో తిర్యానిని మొదటి స్థానంలో ఉంచాలి



జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ప్రజాపక్షం/తిర్యాని :** నీతి ఆయోగ్ కార్యక్రమంలో రాష్ట్రం లోనే తిర్యాని మండలాన్ని మొదటి స్థానంలో ఉంచాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ నీతి ఆయోగ్ కార్యక్రమం పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి ఆయోగ్ కార్యక్రమంలో రాష్ట్రంలోనే తిర్యాణి మండలాన్ని మొదటి స్థానంలో ఉంచాలని అధికారులకు సూచించారు. నీతి ఆయోగ్ కార్యక్రమంలో విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజిక, ఆర్థిక, అభివృద్ధి, చేకూర్పు ఈ ఐదు విభాగాలు 39 అంశాలపై పనిచేస్తుండగా అయిదు విభాగాలకు గాను ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకు వెళ్లాలని సూచించారు. కాగా అంతకు ముందు కలెక్టర్ మండల కేంద్రంలోని పెర్టీలైజర్ షాప్ ను తనిఖీ నిర్వహించారు. రైతులకు సరైన ధరలకే క్రిమిసంహారక మందులను, పత్తి విత్తనాలను విక్రయించాలని యజమానులకు సూచించారు. అధిక ధరలకు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

# సామ శివాని బృందానికి ఛాంపియన్ షిప్

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన నాట్య గురువు సామ శివాని బృందానికి తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో ప్రథమస్థానంలో నిలిచి ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర కళోత్సవాలను మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రీయం, జానపదం, కోలాటం, సినిమా నృత్యపోటీలు నిర్వహించగా రెండు జట్లు ఫైనల్స్ కు చేరుకున్నాయి. చివరి పోటీలో శివానీ బృందం అద్భుత నృత్య ప్రదర్శన చేసి ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. వీరిని నిర్వాహకులు, ధర్మపురి పట్టణవాసులు అభినందించారు.

# అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రయివేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలల యాజమాన్యం అధిక ఫీజుల వసూళ్లతోపాటు అధిక రేట్లకు స్కూల్ యూనిఫాం, బుక్స్‌ను విక్రయిస్తున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం తహశీల్దార్ కృష్ణ చైతన్యకు వినతి పత్రం అందజేశారు. బిజెవైఎం గాజు భాస్కర్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ ఏరియాలోని పాఠశాల్లో ఎటువంటి నోట్‌బుక్స్, యూనిఫాం, షూ లాంటివి విక్రయించరాదని ప్రభుత్వం జీవో జారీ చేసిందని, అట్టి జీవోను ధర్మపురి మండల పాఠశాలల యాజమాన్యాలకు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెజ్జారపు లవన్ కుమార్, బండారి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

# యాదవ సంఘం నూతన కమిటీ నియామకం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గోవిందుపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో యాదవ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. యాదవ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు నక్క లచ్చయ్య, ఉపాధ్యాక్షులు కాల్వ మల్లేష్, ప్రధాన కార్యదర్శి కాల్వ చిన్న రాజయ్య, క్యాషియర్ కాల్వ ఐలయ్యను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, మహేందర్, చిన్న గంగన్న, గాంచుల మల్లయ్య కుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని వాల్గొండ గ్రామంలో గంగపుత్ర సంఘం సొసైటీ అధ్యక్ష ఎన్నికలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా పందిరి నాగరాజు, ఉపాధ్యాక్షుడు చంద్రశేఖర్, సెక్రటరీ మహేందర్, కోశాధికారిగా రాజేందర్‌లతో పాటు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు నాగరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి పాటుపడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మత్స్య శాఖ తరుపున వచ్చి సంక్షేమ పథకాలు సభ్యులకు అందించేలా కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శేఖర్, గంగారాం, నరేష్, రాజయ్య, రాజం తదితరులు ఉన్నారు.

# నులి పురుగులతో అనర్థాలు

### ఆరోగ్యవంతమైన జీవితానికి ఆల్బెండజోల్ మాత్రలు

### * 19 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** విద్యార్థులందరికీ నులి పురుగు మాత్రలు వేయాలని వైద్యాధికారి నరేష్ అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య వైద్యాధికారి సిహెచ్ నరేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లకు జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 3 నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలను 10,590 మందిని గుర్తించినట్లు తెలిపారు. ఈనెల 20 న జరిగే కార్యక్రమంలో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందించడం తల్లిదండ్రులు తమ కర్తవ్యం భావించాలని, భవిష్యత్తులో పిల్లలు ఆరోగ్యవంతంగా తయారైతే వారిలో నైపుణ్యాభివృద్ధి పెంపొందుతుందని, అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని, పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించడం, శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడునందించడం ఆరోగ్య సమాజ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నులిపురుగుల (నట్టల) నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నదని, ఇందులో భాగంగానే ఈనెల 24 న జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకొని 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, అలాగే ఆరోజు ఏదేని కారణం చేత ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోలేని పిల్లల కోసం ఈనెల 27 న కచ్చితంగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈనెల 20న అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్వాడి సెంటర్లు, ప్రైవేట్ స్కూళ్లలో మరియు ఇతర సంస్థలలో 1నుండి 19 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని, అలాగే నులి పురుగులు తయారవడం వల్ల పిల్లల ఎదుగుదల లోపిస్తుందని, పిల్లలలో రక్తహీనత, ఏకాగ్రత లోపించడం, వికారం, విరోచనాలు, ఆకలి లేకపోవడం, కడుపులో నొప్పి రావడం లాంటివి ఏర్పడతాయని తెలిపారు. పిల్లలకు పరిసరాల పరిశుభ్రత, మల, మూత్ర విసర్జన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 20 న నిర్వహించబోయే నులి పురుగుల నివారణ దినోత్సవం విజయవంతం చేసేందుకు పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్స్, ఆరోగ్య సిబ్బంది అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్ రెడ్డి, సి హెచ్ వో గట్టు శ్రీధర్, సూపర్వైజర్లు నరేందర్, రమేష్, శారద హెల్త్ అసిస్టెంట్ లు ఉపాధ్యాయులు అంగన్‌వాడి టిచర్లు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థి చదువుకు భరోసా

### రూ.లు 15వేలు ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఉన్నత చదువులు చదవాలనే ఆకాంక్ష ఉన్నప్పటికి ఆర్థికంగా లేకపోవడంతో ఎంతో మంది పేద విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారు. అటు విద్యార్థుల చదువులకు మేమున్నామంటూ భరోసా ఇస్తూ ముందుకు వచ్చిన సేవా సంస్థకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ధర్మపురికి చెందిన అయ్యోరి అమూల్య అనే విద్యార్థిని పాలిటెక్నికల్ కళాశాలలో సీటు సంపాదించింది. అయితే విద్యార్థిని చదువుకు సంవత్సరానికి 15వేల రూ.లు అవుతుండగా ఆ ఖర్చులు భరించే స్థితిలో తన కుటుంబం లేదని తెలిపింది. దీంతో విద్యార్థి చదువులకు భరోసా కల్పించడం కోసం స్టూడెంట్ అడాప్షన్ ప్రోగ్రాం కన్వీనర్ గొల్లపల్లి గణేష్(ప్రభుత్వ ఉపాధ్యాయుడు) ఆధ్వర్యంలో ధర్మపురి వాస్తవ్యులు సారంగుల అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్లగా విద్యార్థి చదువుకు అయ్యే ఖర్చులు తన స్వచ్ఛంద సంస్థ వికసిత్ భారత్ 2047 ఫౌండేషన్ ద్వారా చెల్లించడానికి ముందుకు వచ్చారు. అందుకు మొదటి సంవత్సరం కింద 15వేల రూ.లను బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో అందజేశారు. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమర్ నాథ్ మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తమ సంస్థ అండగా ఉంటుందని, పేదరికంతో చదువులకు దూరం కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో దాత సారంగుల అమర్ నాథ్, ఉపాధ్యాయులు కాసర్ల వెంకట రమణ, రావులపెల్లి శ్రీనివాస్, గణేష్, చంద్రమౌళి, దినేష్, సంజీవ్, పుష్పలత, స్వప్న, స్వాతి పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్‌లపై తనిఖీలు ఏవి ?

### * రోజుకు వేలల్లో వ్యాపారం ?

### * పుట్ట గొడుగుల్ల వెలుస్తున్న వాటర్ ప్లాంట్ లు ?

**ప్రజాపక్షం/ఎండపల్లి :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల పరిధిలో పలు గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని తాగునీటి సరఫరా చేస్తున్నారు కొంతమంది అవకాశవాదులు. మినరల్ వాటర్ పేరిట ప్లాంట్ల ద్వారా ప్రజలకు సరఫరా అయ్యే నీరు ఎంతవరకు సురక్షితమో ఎవరికీ తెలియదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడబడితే అక్కడ వాటర్ ప్లాంట్ లు పుట్టుకొస్తున్నాయి. బోరు నీటిని క్యాన్లలో నింపి తగిన విధంగా శుద్ధి చేయడం లేదు అని ప్రజలు చర్చించుకుంటున్నారు అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొందరు వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం ఐఎస్ఐ ప్రమాణాలు పాటించడం లేదని, వాటర్ ప్లాంట్స్ నిర్వహించే కేంద్రాల్లో తప్పనిసరిగా నీటిని పరీక్షించే పరికరాలు ఉండాలి. ప్రతి రోజు నీటిని పరీక్షించాలి కానీ చాలా మినరల్ వాటర్ ప్లాంట్స్ లో నిబంధనలు పాటించడం లేదు. ఐఎస్ఐ నిబంధనల ప్రకారం క్లోరినేషన్ ప్రక్రియా ద్వారా 6 దశల్లో శుద్ధి చేయాలి ,ప్రతి నీటి క్యాన్ 30 సార్లు మాత్రమే వాడాలి, మైక్రాన్ ఫిల్టర్ల ద్వారా వడ బోయాలి. ఆ తర్వాత ఓజో నైజోడ్ ట్రీట్మెంట్ ఇవ్వాలి,రోజు క్రమం తప్ప కుండా శుభ్రం చేయాలి, కానీ ఇవేవీ పట్టించు కొకుండా, కొందరు వాటర్ ప్లాంట్స్ ద్వారా సరఫరా చేస్తున్న ప్రతి లీటర్ నీటిలో రసాయనాలు ఎక్కువగా ఉంటున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు, అయినా ఈ అక్రమ నీటి వ్యాపారానికి అధికారులు ఆనకట్ట వేయలేకపోతున్నారు. మిషన్ భగీరథ వాటర్, బోర్ వాటర్ తాగడం వలన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి కాబట్టి మినరల్ వాటర్ తాగితేనైనా ఆరోగ్యకరంగా ఉంటాం అనుకుంటే ఈ మినరల్ వాటర్ లో నీళ్లలో టిడిఎస్ శాతం ఎక్కువగా ఉండటంతో పాటు, రకరకాల కెమికల్స్ కలుపుతున్నారేమోనని అందు వల్లె అనేక సమస్యలు వస్తున్నాయి.అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా అధికారులు, స్పందించి నిబంధనలు పాటించని, అనుమతి లేని వాటర్ ప్లాంట్ లను మూసి వేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రయత్నించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# కొండగట్టు దర్శించుకున్న కేంద్ర మంత్రి

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో ప్రసిద్ది పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని బుధవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దర్శించుకున్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా కరీంనగర్ వచ్చిన మంత్రి సంజయ్ కొండగట్టు అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించరు. అంతకుముందు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆలయ అర్చకులు, అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం



పలికారు. అనంతరం ఆలయంలో అర్చకులు మంత్రి సంజయ్ కుమార్ గోత్రణామాధులతో అర్చనలు చేసి ఆశీర్వదించారు. ఎన్నికల ముందు కట్టిన ముడుపును విప్పిన మంత్రి అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.

# సికిల్ సెల్ ఎనీమియా జీవితకాల వ్యాధి

**ప్రజాపక్షం/ఇచ్చోడ :** సికిల్ సెల్ ఎనీమియా జీవితకాల వ్యాధి అని, దీని బారిన పడినవారికి రక్తం తగ్గిపోయి తీవ్ర రక్తహీనతకు గురవు రని స్థానిక వైద్యాధికారి ఆకుదారి సాగర్ అన్నారు. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా డే ను పురష్కరించుకుని బుధవారం స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడారు. ఈ వ్యాధి గిరిజన ప్రాంతాల్లో ఎక్కు గా వ్యాప్తి చెంది ఉందని, వ్యాధి నిర్ధా రణ పరీక్ష చేయించుకుని సకాలంలో చికిత్స తీసుకుంటే జీవితకాలం పెంచుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. సికిల్ ఎనీమియా సోకి న వ్యక్తిలో ఉన్న కొడ లి కణాలు ఆక్సిజన్ తీసుకు వెళ్లే సామర్థ్యాన్ని తగ్గిస్తాయని, దీంతో శరీ ంలోని ఏదో ఒక అవయవం దెబ్బ తింటుందని స్పష్టం చేశారు.

# పిజిఈసెట్‌లో శాతవాహన ఫార్మసీ విద్యార్థులకు ర్యాంకులు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** యం ఫార్మసీ ప్రవేశాల కోసం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పిజిఈసెట్ ఎంట్రన్స్ పరీక్షలో శాతవాహన విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల విధ్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.కె.శ్రీశైలం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం నిర్వహించిన ఈ పరీక్షలో జి.నందిని 6, యం.సాయికిరణ్ 26, ఎ.రమ్య 29, జి.ప్రత్యూష 46, కె.శివాని 54, బి.పల్లవి 63, వై.స్నేహ 67, ఎం.ప్రవళిక 75, బి.హరీష్ 108, పి.సౌమ్య 128, పి.సాయి పూజిత 148, ఎ.లోకేష్ 165, జి.స్రవంతి 174, ఎస్.జగదీష్ 183, ఎం.భానుమతి 191, డి.మేఘన 208, ఎం.హరిణి 228, కె.శివరాములు 231, ఎల్.ప్రణతి 272, ఎం.సంధ్యారాణి 284, ఎస్.ఆదిత్య 328 ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు.

# మహిళల భద్రత, రక్షణకు షీ టీమ్స్ మరింత భరోసా..

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం రోజున షీ టీం, ఏహెచ్‌టీయూ టీమ్ వారి ఆధ్వర్యంలో విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, బాలికల, విద్యార్థిని విద్యార్థుల రక్షణకు పోలీస్ శాఖ తరుపున షీ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు షీ టీం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. షీ టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా పిర్యాదులు తీసుకుంటారని, 8712670783 నెంబర్‌కు వాట్సప్ ద్వారా కూడా పిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. మహిళలు, బాలికలపై ఆన్‌లైన్‌లో అసభ్యకర పోస్టులు పెట్టే సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా పరిధిలో పాఠశాలలు, కళాశాలలను ఎంపిక చేసి ఒక్కో పాఠశాలకు ఇద్దరి చొప్పున విద్యార్థినిలకు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ఆకతాయిల వేధింపులను అరికట్టడంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి సైబర్ అంబాసిడర్‌లుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు బాలికలు విద్యార్థులు వెంటనే షీ టీం కాల్ చేసి లెదా వాట్సప్ ద్వారా సందేశం పంపించి వెంటనే షీ టీమ్స్ సహాయం పొందాలని తెలిపారు.

# మేయర్ సునీల్‌రావు సచ్ఛీలుడైతే విచారణ ఎదుర్కోవాలి

కాంగ్రెస్ కార్పోరేటర్ల సవాల్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** అవినీతి బయటపెడితే ఎక్కడ జైలుకు వెళ్లాల్సి వస్తుందోనని సునీల్‌రావుకు భయం పట్టుకుందని, సచ్ఛీలుడైతే విచారణ ఎదుర్కోవాలని నగరం లోని కాంగ్రెస్ కార్పోరేటర్లు, మాజీ కార్పోరేటర్లు పేర్కొన్నారు. పొన్నం ప్రభాకర్‌ది కరీంనగర్ గడ్డ అని.. టిఆర్ఎస్ కార్పోరేటర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిజనిజాలు తేలాలని మంత్రి కరీంనగర్ కలెక్టరేట్‌లో మున్సిపల్‌పై సమీక్షించారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నగర మేయర్ సునీల్‌రావు చేసిన ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్‌శాఖలో జరిగిన అవినీతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సారించి ప్రగతి దిశగా చర్యలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రులుగా పదవీ బాధ్యతల చేపట్టి తర్వాత ప్రజలను ,ప్రజాప్రతినిధులను కలవకుండా ఉండే సంస్కృతి కాంగ్రెస్‌లో లేదని, అది బిఆర్ఎస్‌లో కెసిఆర్, కెటిఆర్ వల్లే సాధ్యమవుతుందన్నారు. గత పది నెలల కాలంలో అభివృద్ధి కుంటుపడిందని ప్రజల చేత ఎన్నుకోబడిన కార్పోరేటర్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. మంత్రి సమీక్షించి అవినీతికి పాల్పడ్డ వారిని శిక్షిస్తామనడం పట్ల మేయర్ సునీల్‌రావు కడుపు మండుతోందన్నారు. సమావేశానికి సమాచారం ఇవ్వ లేదనడం హాస్యాస్పదమని, సమాచారం ఇచ్చేది అధికారులనే విషయాన్ని తెలుసుకోకపోవడం సునీల్‌రావు రాజకీయ అనుభవ లేమికి నిదర్శనమన్నారు. అవినీతిపై ప్రజలను మభ్యపెట్టడానికే సునీల్‌రావు ఆరోపణలు చేస్తున్నారన్నారు. అవినీతికి పాల్పడలేదనుకుంటే విజిలెన్స్ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే అర్హత మేయర్‌కు లేదన్నారు. అవినీతిపై నిజనిజాలు తేలాలని మంత్రి పొన్నం సమీక్షించడం పట్ల సునీల్‌రావు ఎందుకు ఉలిక్కిపడుతున్నారని మండిపడ్డారు. నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి పనులలో అవినీతి చోటు చేసుకుందని , నాణ్యత లోపించిందని ఒక మాజీ మేయర్, బిఆర్ఎస్ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుగుతోందన్నారు. అవినీతిలో మేయర్ భాగస్వామ్యం త్వరలోనే తేలుతుందని, శిక్షకు సిద్ధంగా ఉండాలన్నారు. రాబోయే కాలంలో ప్రజలు తప్పకుండా గుణపాఠం చెబుతారన్నారు. స్మార్ట్ సిటీ పనులలో బండి సంజయ్ ప్రమేయం లేదని , కేవలం కెసిఆర్, గత రాష్ట్ర ప్రభుత్వం వల్లనే అభివృద్ధి జరుగుతుందని చెప్పింది




మేయర్ కాదా? అని ప్రశ్నించారు. బండి సంజయ్ సహకారంతోనే నగర అభివృద్ధి సాధ్యమైందని ఇప్పుడెలా చెప్పగలుగుతున్నారని దుయ్యబట్టారు. బండి సంజయ్ కరీంనగర్ పార్కుకు ఒక్క రూపాయి తేలేదని ఎన్నో మార్లు మేయర్ పత్రికా ముఖంగా చెప్పారన్నారు. అభివృద్ధిపై, బిఆర్ఎస్ కార్పోరేటర్లపై నమ్మకం ఉంటే మేయర్ పదవికి రాజీనామా చేసి విశ్వాస తీర్మాణం పెట్టి విశ్వసనీయతను చాటుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పోరేటర్లు కాశెట్టి లావణ్య శ్రీనివాస్, గంట కళ్యాణి శ్రీనివాస్, ఆకుల నర్మదా నర్సన్న, ఆకుల లత ప్రకాష్, చాడగొండ బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, మెండి శ్రీలత చంద్రశేఖర్, పిట్టల వినోద శ్రీనివాస్, సరిల్ల ప్రసాద్, మాజీ కార్పోరేటర్లు మాచర్ల ప్రసాద్, జక్కని ఉమాపతి, ఆరిఫ్, భూమయ్య తదితరులున్నారు.

## సీనియారిటీ లిస్టులో మిగిలిన టీచర్స్‌కు న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు వారికిష్టమైన సబ్జెక్టులలో జాయిన్ అయిన తర్వాత మిగిలిన అన్ని కేటగిరి సబ్జెక్టులలో వారి తర్వాత సీనియారిటీ కలిగిన ఉపాధ్యాయుల చేత భర్తీ చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ పేర్కొన్నారు. మిగిలిపోయిన పోస్టులను భర్తీ చేయకుంటే పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తొందరగా నిర్ణయం తీసుకుని సీనియారిటీ లిస్టులో ఉన్న మిగతా టీచర్స్‌కు న్యాయం చేయాలని కోరారు. సెకండరీ గ్రేడ్ టీచర్స్, పండిట్స్, పిఈటీలకు ప్రమోషన్స్ ఇచ్చినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శులకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## బిసి స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 అభ్యర్థులకు గ్రాండ్ టెస్టులు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే గ్రూప్ 2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కరీంనగర్ బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ 2 గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాల, పెద్దపల్లి అభ్యర్థులు తమ ధరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో జులై 5వ తేదీ వరకు ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్షలు కరీంనగర్ బిసి స్టడీ సర్కిల్‌లో జులై 8, 9, 15, 16, 22, 23, 30, 31 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టెస్టులను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఫర్టిలైజర్ షాప్‌లో చోరీ

**ప్రజాపక్షం/బెజ్జూర్ :** బెజ్జూర్ లోని దీక్షిత ఫర్టిలైజర్ షాప్ లో దొంగతనం జరిగింది. మంగళవారం రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని దొంగలు షాప్ లోకి చొరబడి క్యాష్ కౌంటర్ లో ఉన్న రెండు లక్షల యాభై వేల నగదుని దొంగతనం చేసినట్లుగా ఉదయం గమనించిన యజమాని కవ్వాల సాయి పోలీసులకి పిర్యాదు చేసినట్టు తెలిపారు. దీంతో ఎస్ఐ విక్రమ్ సంఘటన స్థలానికి చేరుకొని సిసి టివి పుటేజీని పరిశీలించారు. అనంతరం డాగ్ స్క్వాడ్ తో పరిసర ప్రాంతాలని గమనించారు. ఫింగర్ ప్రింట్స్ సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్తు అందించాలి

ఎస్ ఈ సుదర్శన్

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం,అడవిశ్రీరాంపూర్ సబ్ స్టేషన్ లను ను తెలంగాణ ఎన్ పి డి సి ఎల్, ఎస్ ఈ బొంకూరి సుదర్శన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ ఈ విద్యుత్ సరఫరా పై విద్యుత్ ఎఈ, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వినియోగదారులకు,రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని సిబ్బంది కి పలు సూచనలు చేసారు. ట్రాన్స్ఫార్మర్ ఫెయిల్ అవకుండా మరమ్మతులు చేయుటకు ఆదేశించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయుటకు విద్యుత్ సిబ్బంది వారికి కేటాయించిన హెడ్ క్వార్టర్ లో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ హనుమాన్ నాయక్, అసిస్టెంట్ ఏఈ అర్చన, తోపాటు విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

పిడిఎస్‌యు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విధ్యార్థి సంఘం (పిడిఎస్‌యు) ఆధ్వర్యంలో బుధవారం ఏవో సుధాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పిడిఎస్‌యు అధ్యక్షుడు రత్నం రమేష్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలు కనీస సౌకర్యాలు పాటించకుండా విద్యా సంస్థలను నడుతుపున్నారని, నాలుగు అక్షరాల చదువు కోసం లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ తోక పేర్లతో ఐఐటి, నీట్, ఒలంపియాడ్, సిబిఎస్ఈ, కరికులం అని పేర్లు పెట్టి విధ్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. అంతేగాకుండా పాఠశాలలో కనీస సౌకర్యాలు మూత్రశాల, ల్యాబ్ , లైబ్రరీ, ఫైర్ సెట్టింగ్ క్వాలిఫై టీచర్స్‌ను పెట్టకుండా విద్యను అందిస్తున్నారని పేర్కొన్నారు. రేకుల షెడ్లలో కూర్చోబెట్టి చదువు చెప్పించి మానసికంగా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అంతేకాకుండా బుక్స్, యూనిఫామ్స్ టై బెల్ట్ లాంటివి తమ




పాఠశాలలోనే కొనాలని, వాటిపై వ్యాపారం చేస్తున్నారని వాపోయారు. ప్రైవేట్ జూనియర్ కాలేజీలు , గుర్తింపు లేని కాలేజీలు ఎన్నో ఉన్నాయని, ముందస్తుగానే అడ్మిషన్ చేస్తూ విధ్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని తెలిపారు. కేవలం ఒక భవనం చూపించి వాటిలో విధ్యార్థులను కూర్చోబెట్టి, అంతే గాకుండా పేరు ఒక దగ్గర చదువు అందించేది ఒక దగ్గర చేస్తూ విధ్యార్థులను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యం కేవలం ధనార్జనే ధ్యేయంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, కాబట్టి ప్రైవేట్ విద్యా సంస్థలను గుర్తించి వాటి గుర్తింపును రద్దు చేయాలని, అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, సందీప్, నవీన్, శ్రీకాంత్, సృజన్‌లు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలో ఈనెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని వందశాతం విజయవంతం చేయాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వైద్యశాఖాధికారి తుకారాంభట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలు జిల్లాలో 1,73,494 మంది ఉన్నారని అన్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాలలతో పాటు బడిబయట ఉన్న పిల్లలకు మాత్రలు ఇవ్వడం జరుగుతుందని, నులిపురుగుల నివారణా మాత్రలు వేసుకోవడం పిల్లల ఆరోగ్యానికి చాలా ముఖ్యమని తెలిపారు. ఏ కారణంచేత పిల్లలు ఈనెల 20న మాత్రలు తీసుకోనట్లయితే జూన్ 27న మరోసారి అవకాశం ఉంటుందని తెలిపారు. నులిపురుగుల నివారణా మాత్రలను పిల్లలకు భోజనం చేసిన అనంతరం అందించాలని, ఏవయినా ఇబ్బందులు తలెత్తితే వెంటనే వైద్యులకు తెలియపరచాలని అన్నారు. పిల్లలకు మాత్రలు అందించే ముందు వారి ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకుని, ఆరోగ్యంగా ఉంటేనే అందించాలని సూచించారు. పిల్లలెవరికీ మాత్రలు ఇంటివద్దకి ఇవ్వకూడదని సూచించారు.

## విద్యతోనే సమాజంలో గుర్తింపు




**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని, ఆకెనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జర్రిపోతుల రాజేశ్వరి తెలిపారు. బెల్లంపల్లి మండలంలోని ఆకెనపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేను ముగించుకుని నూతనంగా పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమం చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్గంలో నడుచుకోవాలని, విద్యా బుద్ధులతో పిల్లల భవిష్యత్తు ఉండాలని, విద్యార్థుల తల్లిదండ్రులు సరస్వతి అమ్మవారికి పూజలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ప్రధాన అర్చకులు రాంపల్లి అశోక్ శర్మ పంతులు, ఉపాధ్యాయురాలు కె. జ్యోతి, అంగన్వాడి టీచర్స్ సత్యమ్మ, పద్మ, విద్యార్థులు పూర్వ విద్యార్థులు గ్రామ పెద్దలు గ్రామ పుర ప్రముఖులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాకు విశేష స్పందన

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు దాదాపు 170 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఐసిఐసిఐ, ఎస్ బ్యాంకులలో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాల భర్తీ కొరకు ఈ జాబ్ మేళా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ మాట్లాడుతూ యువత ఇలాంటి జాబ్ మేళాలో పాల్గొనడం ద్వారా ప్రైవేటు రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.లక్ష్మి నరసింహం మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన యువత ఖాళీగా ఉండకుండా ఇలాంటి అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం 35 మంది మొదటి దశలో ఎంపిక కాగా వీరికి ఆన్ లైన్ ద్వారా రెండవ దశ ఎంపిక ప్రక్రియ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ప్రతినిధి సాయి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేస్ మెంట్ సెల్ ఇంచార్జ్ డి.జనార్థన్, డా.వి.దేవేందర్, యువతీ, యువకులు పాల్గొన్నారు.

## "పుల" రహదారి



**ప్రజాపక్షం/ముత్తారం :** ఓడేడ్ నుండి మంథని వెళ్లే రహదారిలో ముత్తారం మండలం ఓడేడ్ టు ముత్తారం వరకు ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న హరిత హారం చెట్లు అక్కడక్కడ మధ్యలో పూలు వేసి ఎర్రని రంగులో ఉన్న చెట్లకు ఎర్రపూలు పూసి ఉండడంతో రహదారి ఇరువైపులా రాకపోకలు చూస్తున్న ప్రయాణికులకు సుందరంగా ఆహ్లాద కరంగా మారింది. అటువైపు ప్రయాణించే ప్రయాణికులు వాహనాలు ఆపి పువ్వుల చెట్ల ఉంటూ సెల్ఫి ఫోటోలు తీసుకుంటున్నారు.ఆ రహదారిలో రాకపోకలు చేస్తున్న ప్రయాణికులు బాటసారులు, వాహనదారులు సెల్ఫీ ఫోటోలతో ఆహ్లాదక రంగా సుందరంగా అబ్బురపరస్తు రాకపోకలు కొనసాగిస్తున్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి పారుపల్లి ప్రధాన రహదారి అయిన కాసర్ల గడ్డ గ్రామ శివారులోని రహదారిపై ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం కాలపల్లి గ్రామానికి చెందిన సూర కుమార్ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామానికి చెందిన కలవేన రమేష్ లకు కాళ్లు విరిగిపోగా తీవ్ర గాయాలయ్యాయి వీరిని హుటాహుటిన పెద్దపల్లి ఆసుపత్రికి కలవేన రమేష్ ను వరంగల్ ఆసుపత్రికి సూర కుమారులను తరలించారు. కాగా ఈ సంఘటన స్థలానికి స్థానిక పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం పోలీసులు తెలిపారు.

# సికిల్ సెల్ అనీమియా నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : సికిల్ సెల్ అనీమియా (రక్తహీనత) నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ డిఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్యాధికారులకు, ఏఎన్ఎం లకు, ఆశా కార్యకర్తలకు గిరిజన సంక్షేమ శాఖ, వైద్యారోగ్య శాఖ సంయుక్తంగా జిల్లా స్థాయి సికిల్ సెల్ వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కె.ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం పురస్కరించుకొని భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్య విభాగం , రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సమన్వయంతో సికిల్ సెల్ మిషన్ 2047 నాటికి దేశాన్ని సికిల్ సెల్ అనీమియా నుండి విముక్తి చేయడానికి ఒక మిషన్ ప్రకటించిందని,ఇందులో అవగాహన కల్పించడం, ప్రభావిత గిరిజన ప్రాంతాల్లోని 040 సంవత్సరాల వయస్సు గల మొత్తం 7 కోట్ల మందికి పరీక్షలు చేయడం కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రయత్నాల ద్వారా రోగులకు చికిత్స అందించడం జరుగుతుందని అన్నారు.సికిల్ సెల్ వ్యాధి అనేది ఒక జన్యుకారక వ్యాధని,సికిల్ కణాల దృఢత్వం, అసాధారణ ఆకారం శరీరంలోని చిన్న రక్తనాళాల ద్వారా కదిలే సామర్థ్యాన్ని తగ్గిస్తుందని, ఇది రక్త ప్రసరణలో అడ్డంకిని కలిగిస్తుందని అన్నారు. సికిల్ సెల్స్ లో ఆక్సిజన్ మోసుకొని వెళ్లే సామార్థ్యం తగ్గి పోవడం వలన, ఆక్సిజన్ తగినంత మొత్తంలో లేకపోవడం వలన శరీరంలోని ఏదైనా భాగంలో కణజాలం అవయవ నష్టం జరగవచ్చని తెలిపారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధిని రక్త కణాల తగ్గుదల (రక్తహీనత), కళ్ళు పసుపు రంగులోకి మారడం, శరీరం, కీళ్లలో తీవ్రమైన నొప్పులు, ఊపిరి ఆడకపోవడం, ఆయాసం, పునరావృత అంటు వ్యాధులు, గర్భధారణ సమయంలో అవయవ నష్టం వంటి లక్షణాల ద్వారా గుర్తించవచ్చని అన్నారు. సికిల్ సెల్ వ్యాధి వస్తే భయపడాల్సిన అవసరం లేదని, జిల్లాలోని మీ సమీప ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యాధికారిని సంప్రదించి వారు చెప్పిన విధంగా మందులు వాడితే తగ్గుతుందని, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక కేంద్రాలు, సబ్ సెంటర్లలో వీటిపై క్యాంపులు అవగాహనా సదస్సులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డి. జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిదిలో గల గిరిజన నివాసాలలో గల కుంటుంబాలకు జూన్ 20 నుంచి జూలై 7 వరకు అవగాహాన కల్పించి పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సమగ్ర పిల్లల సర్వే ప్రారంభం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 36 వార్డులలో 016 సంవత్సరాల పిల్లల సర్వే ప్రారంభం అయ్యిందని మండల విద్యాధికారి సురేంద్ర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశాల మేరేకు మున్సిపల్ ఆర్ పీ లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఈరోజు నుండి ఇంటింటికి తిరిగి పిల్లల వివరాలు సేకరిస్తున్నరని ,పిల్లల కుటుంబ వివరాలతో పాటు అసలు పాఠశాలకు వెళుతున్నారా లేదా? ప్రభుత్వ పాఠశాలకు , ప్రైవేట్ పాఠశాల కు వెళ్లే వారితో పాటు అసలు పాఠశాలకు వెల్లని వారి వివరాలు సేకరిస్తున్నామని, మంగళవారం నుండి శనివారం వరకు సర్వేను పూర్తి చేసి పెద్దపల్లి టాన్ కు సంబందించిన ఎద్యుకేషన్ రిజిస్టార్ రూపొందించనున్నట్లు సురేందర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆర్పీ ఆశా అంగన్వాడీ టీచర్ల తో పాటు పెద్దపల్లి క్లస్టర్ సీ ఆర్ పీ బాలసాని వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం అర్జీ 3 డివిజన్ లో కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహించే బేగంపేట గ్రామానికి చెందిన భోగ రమేష్ ఇటీవలఅనారోగ్యం తో మృతి చెందిగా బుధవారం అర్జీ 3 ఎస్ అండ్ పిసి సిబ్బంది రూ.42 వేలు, రూపాయలను ఎస్ఎస్ఓ లక్ష్మీ నారాయణ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ముందుగా మృతుని చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే వివిధ కాంట్రాక్ట్ కంపేనికి చెందిన తోటి సెక్యూరిటీ గార్డ్ లు రూ.38 వేలు అలాగే రమేష్ తను చదువు కున్న నాటి సహా విద్యార్థులు రూ.18వేలు ఆర్థిక సాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికుల మండల అధ్యక్షుడు ఉడుత శంకర్ యాదవ్, ఎస్ ఎన్ పి సి సిబ్బంది సురేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ మంత్రిని నియమించండి...

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ప్రభుత్వం ఏర్పడి ఇన్నిరోజులు గడుస్తున్నా విద్యాశాఖమంత్రిని ఎందుకు నియమించలేదని బీజేవైఎం జాతీయ అధికార ప్రతినిధి చేకూటి అనూష్ యాదవ్ అన్నారు. బుధవారం పాఠశాలు,కళాశాలలు ఓపెన్ అయినా విద్యాశాఖను ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు.ఈ ప్రభుత్వానికి మధ్యం మీద ఉన్న ద్యాస విద్యాపై ఎందుకు లేదని విద్యార్థుల గోడును ఎవరికి చెప్పుకోవాలని అనూష్‌యాదవ్ ఎద్దేవా చేశారు.వెంటనే విద్యాశాఖను బర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## కలెక్టర్‌ను కలిసిన ఆమ్ఆద్మీపార్టీ జిల్లా కన్వీనర్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్ ను బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలం రాగానే అనేక వ్యాధులకు గురికావడం వంటివి జరుగుతుందని తెలిపారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రజల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

## జిఎం ఆఫీస్ ఎదుట ధర్నాను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/రామగిరి :** సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుడు ఒక్కరోజు డ్యూటీకి రాకపోతే పెనాల్టీ పేరిట 500 రూపాయలు రికవరీ చేయడానికి నిరసిస్తూ ఈనెల 25వ తేదీన ఆర్జీ 3 జిఎం ఆఫీస్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న పిలుపునిచ్చారు. బుధవారం ఓసిపి1, ఓసిపి2 ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుల మీటింగ్ నిర్వహించి కార్మికులను ఉద్దేశించి ఆకుల వెంకన్న మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుడు ఆరోగ్యం బాగాలేక కుటుంబ పరిస్థితి బాగాలేక ఒక్కరోజు డ్యూటీకి రాకపోతే 500 రూపాయలు చేసిన మాస్టర్ నుండి సంబంధిత కాంట్రాక్టర్స్ కార్మికుని వేతనం నుండి రికవరీ చేయడం జరుగుతుందని,ఇప్పటికి ఓసిపి 2 ప్రాజెక్టులో ఒక కార్మికునికి మూడో నెల 3500 నాలుగో నెల 45 00 సివిల్ విభాగంలో నెలకు 1500 నుంచి 3000 రూపాయల వరకు రికవరీ జరుగుతున్నది సంబంధిత కాంట్రాక్టర్స్ కు వేలాది రూపాయలు బిల్లులో సింగరేణి యాజమాన్యం రికవరీ చేయడం జరుగుతున్నది కానీ టెండర్ నాన్స్ ప్రకారంగా కార్మికులను పనులకు వాడుకోకుండా ఇతర పనులకు వాడుకోవటం అదేవిధంగా కార్మికులకు కనీస లీవులు కూడా ఇవ్వకుండా చట్టాలను ఉల్లంఘించిన యాజమాన్యం సొంత చట్టాలను తీసుకువచ్చి కాంట్రాక్టు కార్మికుల నుండి వేతనం నుండి రికవరీ చేస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తుందని కాబట్టి ఇప్పటికైనా ఇట్టి విషయం రద్దు చేయాలని దీనికి వ్యతిరేకంగా కార్మికులందరూ ఈనెల 25వ తేదీన ఆర్జీ 3 జిఎం ఆఫీస్ ముందు జరిగే ధర్నాను అధిక సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలి...

### మున్సిపల్ చైర్ పర్సన్ రమా సురేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/మంథని :** క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమా సురేష్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న మంథని ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టి రాజు ఎలెవన్, సందీప్ ఎలెవన్ టీంలు తలపడగా టీ, రాజు టీం చాంపియన్‌గా నిలిచింది. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన టీ రాజు టీంకు రూ.10వేలు, రన్నర్‌గా నిలిచిన సందీప్ టీంకు రూ.5వేల నగదుతో పాటు మెమోంటోలను అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు క్రీడారంగంలో రాణించాలని, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపు ఓటమిలను స్పిరిట్‌గా తీసుకోవాలన్నారు. గ్రామీణ స్థాయిక్రీడలను ప్రోత్సహించడం ద్వారా క్రీడాకారుల్లోని క్రీడా నైపుణ్యం వెలుగులోకి వస్తుందని, ఈ టోర్నమెంట్ నిర్వహించిన నిర్వాహకులను ఆమె ఈసందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ముస్కుల సురేందర్‌రెడ్డి, మైనార్టీ కమిటి రాష్ట్ర కార్యదర్శి ఎండీ జమీల్ అహ్మద్, మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ సీపతి బానయ్య, కౌన్సిలర్‌లు వీకే రవి, గుండా విజయలక్ష్మి పారావు, వేముల లక్ష్మి సమ్మయ్య, నాయకులు వొడ్నాల శ్రీనివాస్, శశిభూషన్‌కాచే, పోలు శివ, నూకల బానయ్య, అజీంఖాన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...



**ప్రజాపక్షం/కుంటాల :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన200607 10వ తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు.త్వరలో పాత భవనాన్ని కూల్చివేయనున్నారన్న సమాచారంతో పూర్వ విద్యార్థులందరూ పాఠశాలకు చేరుకుని ఫోటోలు తీసుకున్నారు.ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించి,విద్య బుద్ధులు నేర్పిన గురువులను,శాలువ,పూలమాలతో ఘనంగా సన్మానించారు.జ్ఞాపికలను అందజేశారు.పాఠశాలలో చదివిన నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. అనంతరం గ్రూప్ ఫోటోలు తీసుకున్నారు.అనంతరం సామూహిక భోజనాలు చేశారు.17 సంవత్సరాల తర్వాత కలిసి చదివిన మిత్రలంతా ఒకచోట కలుసుకోవడం పట్ల అనంగం వ్యక్తం చేశారు.యోగక్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు.ఉదయం నుండి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్ రావు, భోజన్న, రాంనాథ్, సాగర్, విద్యార్థుల బృందం తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం గ్రామ మాజీ సర్పంచ్ కొందపురం భూమన్న అబ్దులాపూర్ గ్రామానికి చెందిన కట్ట చిన్నా రెడ్డి,కనకాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ నరేష్ నాన్నమ్మలు ఇటీవల స్వర్గస్థులైనారు.విషయం తెలుసుకున్న ముధోల్ నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణ రావు పటేల్ వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఇట్టి కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గడ్డం సుదర్శన్ రెడ్డి,మండల అధ్యక్షులు లలిత భోజన్న,వైస్ ఎంపీపీ నారాయణ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ రత్నకర్ రావు,ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు,శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సోమ సుధీర్ రెడ్డి,సర్పంచులు,ఎంపీటీసీలు,బైంసా పట్టణ అధ్యక్షులు శంకర్ చంద్రే,సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపి, పిఎంపిలకు మద్దతుగా బోథ్ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నేరడిగొండ :** ప్రభుత్వం చేపట్టిన ఆర్ ఎంపీ,పిఎంపీ లపై అక్రమ దాడులు అరెస్ట్ లను ఖండిస్తూ బుధవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆర్ఎంపీ డాక్టర్ల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమానికి సంఘీభావం తెలిపిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గ్రామాలల్లో ఆర్ఎంపీల సేవలు అభినందనీయమని వారు పేద ప్రజలకు నిస్వార్థంగా చేస్తున్న సేవలను చూడలేని ప్రభుత్వం అక్రమ దాడులకు అరెస్టులకు పాల్పడడం సిగ్గు చేటని అన్నారు.ఆర్ఎంపీలపై దాడులు అరెస్టులు నిరసనగా ఆర్.ఎం.పి ల తరుపున పోరాడటానికి సిద్ధంగా ఉన్నానని సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదని అన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇది తగదని సిగ్గు చేటని అమయకులైన ఆర్ఎంపీలపై జరుగుతున్న కుట్రలపై న్యాయ పోరాటాలు చేయడానికే పుట్టిన బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని అన్నారు.అధైర్య పడకండి మా పార్టీ మీకు అండగా ఉందని,ఈ కార్యక్రమంలో జిల్లా నియోజకవర్గ ఆర్ఎంపీలు,పీఎంపీలు పాల్గొన్నారు.

## అవమానం భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్య...



**ప్రజాపక్షం/తానూర్ :** అవమానం భరించలేక ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య జరిగిన సంఘటన మండలంలోని మొగిలి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ లోకం సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మొగిలి గ్రామనికి చెందిన ఆటో డ్రైవర్ జోగ్దండే శివాజీ(31) అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జరికోటి శివరాజ్(30) మధ్య మంగళవారం డబ్బుల విషయంలో గొడవ కావడంతో శివాజీ తీసుకున్న డబ్బులు ఎప్పుడు ఇస్తావు అని శివ రాజ్ అతన్ని కొట్టి అవమానించడంతో అవమానం భరించలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లో గల సిలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని అత్మహత్య చేసుకుని చనిపోయినాడు అని శివాజీ భార్య సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకం సందీప్ తెలిపారు.